స్కూల్ బ్యాగుల పంపిణీ



ఘట్‌కేసర్: అవుషాపూర్ ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్రీయ గ్రామీణ సాక్షరత మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను శనివారం పంపిణీ చేశారు. పేద విద్యార్థులు విద్యకు అండగా నిలబడేందుకు బ్యాగులు పంపిణీ చేశామని మిషన్ సభ్యులు పేర్కొన్నారు. నవీన, సురేష్ , బీజేపీ నేత మశ్చేందర్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, మహేష్, వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్‌లో వర్క్‌షాప్



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సాఫ్ట్‌వేర్ అభివృద్ధిపై(డీఈవీవోపీఎస్) వర్క్‌షాప్ నిర్వహించారు. రెండ్రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో బెంగుళూరు ఎక్ట్స్రీమ్ నెట్‌వర్క్స్ క్లౌడ్ ఆపరేషన్ ఇంజినీరింగ్ నిపుణులు బాలు పాలరాజ్ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఐటీ ఆపరేషన్లు సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, శృతి, అంజాన్‌షేక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్

మేడ్చల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్‌లోని విభా స్కూల్‌లో శనివారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సంకేతాలు, నిజ జీవిత సంఘటనలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని, అప్పుడే ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. అనంతరం పాఠశాలలో బోనాల వేడుకలు నిర్వహించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

- రూ.15 లక్షల విలువైన గంజాయి..
- మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



శామీర్‌పేట్: గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న ముఠాను మేడ్చల్ ఎస్వోటీ, శామీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన శనివారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక, బీదర్‌కు చెందిన బెల్లాలే ప్రవీణ్, అవినాష్ అలియాస్ వికాస్‌జాదవ్, సతీష్ కదంలు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు తరచూ వచ్చి ఎండు గంజాయిని అమ్ముకుని వెళ్లేవారు. ఈ క్రమంలోనే ఒడిశా రాష్ట్రం పోడియా గ్రామానికి చెందిన జితు అలియాస్ హ్యాపీ వద్ద నుంచి 42 కిలోల గంజాయిని సేకరించారు. ఒడిశా నుంచి నగరానికి తరలిస్తున్న క్రమంలో ఇతర వాహనాలు (ట్రక్, క్యాబ్) వాహనాల్లో శామీర్‌పేట వద్ద దిగారు. కొనుగోలుదారు కోసం వేచి చూస్తుండగా విశ్వసనీయ సమాచారంతో పోలీసులు తనిఖీ చేపట్టి.. 42 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ప్రవీణ్, వికాస్‌జాదవ్, సతీష్ కదంలను అదుపులోకి తీసుకుని శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెప్మా ఆధ్వర్యంలో ప్రదర్శన



కీసర: రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల కార్యాచరణలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో శనివారం వివిధ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు, రుచికరమైన రకరకాల తెలంగాణ ఆహార పదార్థాలు, పిండి వంటలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ వెంకట్‌రెడ్డి హాజరై పరిశీలించారు. అనంతరం పలు కాలనీల్లో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం, రోడ్డుకు ఇరుపక్కల ఉన్న చెత్త, పొదలను తొలగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. డీఈఈ బాలమురళి, మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్స్, కార్యాలయ సిబ్బంది, మెప్మా మహిళలు పాల్గొన్నారు.

లక్ష్యం మరిచారు!

- అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడానికి అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గర్భిణీగా పేరు నమోదు చేసుకున్నప్పటి నుంచి పుట్టిన సంతానం 6 నెలల వయస్సు వచ్చేంత వరకు వీరికి పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ వ్యవస్థ నీరు గారుతోంది.

– ఘట్‌కేసర్



ఘట్‌కేసర్‌లో అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వాడీ కేంద్రంలో గదుల దుస్థితి

సొంత భవనాలు కరువు..

◆ ఘట్‌కేసర్ సెక్టార్‌లో 22, కొర్రెముల్ సెక్టార్‌లో 23 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. సగం కేంద్రాలకు సొంత భవనాలు లేక చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా కేంద్రాలు ప్రభుత్వ భవనాలు, ప్రాథమిక పాఠశాలలు, కమ్యూనిటీ భవనాల్లో నడుస్తున్నాయి. పట్టణంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక కమ్యూనిటీ భవనంలో కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న కేంద్రం ఇరుకుగా ఉండటంతో నూతన భవనం నిర్మించాలని బ్రూక్‌బాండ్ స్కూల్ ఎదురుగా ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్థలం కేటాయించారు.

నత్తనడకన సాగుతున్న పనులు..

◆ రూ.లక్షలు వెచ్చించి పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. భవనం పనులు పూర్తి చేసి చిన్నారులు, గర్భిణులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

నిరుపయోగంగా భవనం..

◆ ఐసీడీసీ, పంచాయతీ, మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న ఈ భవనం పనులు ప్రారంభమై దశాబ్దకాలం దాటిన పట్టించుకునే వారే కరువయ్యారు. గతంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులు కేటాయించినా పనులు పూర్తి కాలేదు. డోర్లు, కిటికీలు బిగించలేదు. గదిలో కాంట్రాక్టర్ బిగించిన ఎలక్ట్రిక్ కేబుల్, ఆన్‌ఆఫ్ స్విచ్‌లు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. గదిలో చిన్నారులు కూర్చునే నేలపై టైల్స్ వేయలేదు. సొంత భవనం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరుతున్నారు.

చిన్నారులకు అనారోగ్య సమస్యలు..

◆ అసంపూర్తి గదులు, చీకటిగా ఉండటంతో చిన్నారులు భయాందోళనకు అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందంటున్నారు. దీనిపై అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులను పూర్తిచేసి చిన్నారులకు సొంత భవనం అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ విషయమై సీడీపీఓ స్వాతిని వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవనం అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

భవనం అందుబాటులోకి తేవాలి..



దశాబ్దకాలంగా భవనం పనులు పూర్తి కాకపోవడం అధికారుల నిర్లక్ష్యమే కారణం. చిన్నారులు ఇరుకు గదుల్లో గడుపుతున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనం పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి, చిన్నారులకు అందుబాటులోకి తీసుకురావాలి.

– రాధిక, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి..



ఒక గదిలోనే తరగతులు నిర్వహించడం, చిన్నారుల వంటలు చేయడం ఇబ్బందిగా ఉంటుంది. చిన్నారుల ఆరోగ్యానికి మంచిది కాదు. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ భవనం పనులు పూర్తి చేయడానికి నిధులు విడుదల చేయాలి.

– కొమ్మిడి శోభారాణి, మాజీ ఎంపీటీసీ అంకుషాపూర్

'ఏఐ' వాడకంలో ముందుండాలి



'ఏఐ భారత్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వాడకంలో దేశం ముందుండేలా విద్యార్థులు ఆ దిశగా అడుగులు వేయాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ గ్రూప్స్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన ఏఐ భారత్ ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని పలు దేశాలు ఏఐ వాడకంలో ముందున్నాయన్నారు. మన విద్యార్థులు సైతం ఆ దిశగా పయనం సాగించాలన్నారు. ఏఐ ఓ అద్భుతమని విద్యార్థులు అవగాహన పొందాలన్నారు. గోపాల్‌రెడ్డి, శ్రీశైలంరెడ్డి, అభినవ్‌రెడ్డి, జంగారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి..

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని పొన్నాల్ వార్డులో సమస్యల పరిష్కారానికి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి స్థానిక నేతలు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని పొన్నాల్‌లో డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ దీపాలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. శామీర్‌పేట్ మండల బీజేపీ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, పొన్నాల్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రాహుల్‌ముదిరాజ్, నాయకులు మురళీగౌడ్, సాయి, చరణ్ పాల్గొన్నారు.

భారీ వర్షం !

జలమయమైన లోతట్టు ప్రాంతాలు

జవహర్‌నగర్ ప్రధాన రహదారిలో..



న్యూ వేంకటేశ్వరకాలనీలో వరద ఉధృతి





జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిచిన వరద నీరు

మేడ్చల్: వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి సరైన వర్షం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వర్షం లేక ప్రజలు నీటి కోసం అల్లాడుతున్న సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురియడంతో ఉపశమనం కలిగింది. శనివారం సాయంత్రం 2–3 గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కాలనీల రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ వద్ద వరద నీరు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు వర్షంలోనే శ్రమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో శనివారం కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. పలు కాలనీలు వరదతో చెరువులను తలపించాయి.

రోటర్‌డ్యామ్‌లో పాలకమండలి ఏర్పాటు



ప్రమాణ స్వీకారం చేసిన విద్యార్థులు

పోచారం: నారపల్లిలోని రోటర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 2025–26 విద్యాసంవత్సరానికి విద్యార్థుల పాలక మండలిని శనివారం ఏర్పాటు చేశారు. హెడ్‌గర్ల్‌గా హమైరా సహాని, హెడ్‌బాయ్‌గా అగస్త్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ నిర్వాహకులు మాట్లాడుతూ.. పిల్లలు చిన్నప్పటి నుంచే బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం అలవాటు చేసుకోవాలన్నారు. స్కూల్‌లో ఎప్పుడైనా సమస్యలు ఎదురైతే తెలివితేటలతో పరిష్కరించుకునే శక్తిసామార్థ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని చెప్పారు. స్కూల్ అడ్వైజర్ వాసుదేవ్, డైరెక్టర్ శ్వేతారెడ్డి, ప్రిన్సిపాల్ రూపారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై కమిషనర్‌కు ఫిర్యాదు

మేడ్చల్: పట్టణంలోని వినాయక్‌నగర్–1లో ఓ ఇంటి యజమాని ఏకంగా రోడ్డును ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టాడని వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ చంద్రకాష్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వినాయక్‌నగర్ రోడ్డు నెంబర్–1లో రోడ్డును 7 ఫీట్ల వరకు కబ్జాచేసి, అక్కడ షాపుల బోర్డులు, షాపు ముందు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని, 'అడిగితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకొండి'.. అంటున్నారన్నారు. రోజూ వేల మంది బస్టాండ్‌కు వెళ్లే రోడ్డు కావడంతో కాలనీ వాసులతో పాటు పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారని చెబుతున్నారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. కాలనీవాసులు నరేందర్‌రెడ్డి, రవికుమార్, చంద్రకాంత్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కీసర: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కీసర సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.హరిప్రసాద్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా రాంపల్లిలోని కేజీఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో కీసర ఇన్‌స్పెక్టర్ సీహెచ్.హరిప్రసాద్, కళాశాల అధ్యక్షుడు డాక్టర్ గోవిందరెడ్డి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితే భవిష్యత్‌తరాలకు మెరుగైన ప్రపంచాన్ని అందిస్తున్నామన్నారు. వనమహోత్సవం కేవలం ఉత్సవం కాదని, బాధ్యత అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. డైరెక్టర్ ప్రొఫెసర్ పీవీ.రమణారావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, విజయ్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



బోనాల వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కీసర: నాగారంలోని రాక్‌ఉడ్స్ స్కూల్‌లో బోనాల జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించేలా వేడుకలను విద్యార్థులు శనివారం కొనసాగించారు. సంప్రదాయాలు, ఆధ్యాత్మిక భావన, ఆచార వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. స్కూల్ ఛైర్మన్ రామానాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ పద్మ అయ్యంగార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఘట్‌కేసర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండల విద్యాధికారి శ్రీధర్ (ఎంఈఓ)కు ఆయన కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. అనంతరం ఎంఈఓకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు చింతల యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం మధ్యాహ్న భోజన సిబ్బందికి నెల నెల జీతాలు, బిల్లులు చెల్లించాలని, ప్రతి స్కూల్‌కు గ్యాస్ సిలిండర్, గ్యాస్‌స్టౌ అందజేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ఈనెల 25 వరకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. లేదంటే మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట వంటవార్పు, రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. శ్రీనివాస్, పుష్ప, శోభారాణి, కవిత, భాగ్య, అఫ్జల్‌బీ, రహిమా, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌కు వాటర్‌ప్లాంట్ విరాళం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్

మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి బాసురేగడిలోని సెయింట్ క్లారెట్ స్కూల్‌కు గౌడవెల్లి మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. శనివారం నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు స్వచ్ఛమైన నీరు తాగి ఆరోగ్యంగా ఉండేందుకు పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు రాజకుమారిసుధాకర్, అంథోనమ్మ ఫిలిప్స్, మాజీ సర్పంచ్ ఈశ్వర్, నాయకులు భగవాన్‌దాస్, మరిలమ్మ, ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోతుల బెడదను అరికట్టండి !

కీసర: నాగారం మున్సిపాలిటీ 12వ వార్డు వేంకటేశ్వరనగర్‌లో కోతుల బెడద వల్ల ఇబ్బందులు పడుతున్నామని నాగారం మున్సిపాలిటీ అధికారులకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. కోతులతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా స్పందించలేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీవాసులు సురేష్, మహేష్, సురేష్, శ్రీకాంత్‌యాదవ్, యాదిరెడ్డి, నాగరాజు, సంపత్‌కుమార్, వినోద్‌కుమార్, రవికుమార్, సుదర్శన్, రాంరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు





సెరినిటీ స్కూల్‌లో..



అరుంధతి స్కూల్‌లో బోనాల ఉత్సవాల్లో చిన్నారులు

కీసర: నాగారం మున్సిపాలిటీ కంత మహేశ్వరస్వామి ఆలయంలో శనివారం గౌడ కులస్తుల ఆధ్వర్యంలో బోనాల పండుగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళలు బోనాలు సమర్పించారు. అరుంధతి స్కూల్‌లో శనివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ దశరథ్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెరినిటీ స్కూల్‌లో..

కీసర:నాగారం మున్సిపాలిటీలోని సెరినిటీ స్కూల్‌లో శనివారం బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పోతురాజుల, అమ్మవార్ల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. స్కూల్ ముఖ్యకార్యదర్శి వసంత, కరెస్పాండెంట్ జంగిరెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మున్సిపాలిటీల పరిధిలోని పలు పాఠశాలల్లో శనివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. మునీరాబాద్‌లోని ఎస్‌కేఎమ్ స్కూల్‌లో నిర్వహించిన బోనాల వేడుకల్లో మాజీ సర్పంచ్‌లు గణేష్, చిట్టిమిల్ల గణేష్, స్కూల్ డైరెక్టర్ శృతిగౌడ్, కరస్పాండెంట్ లవకుమార్,వైస్ ప్రిన్సిపాల్ క్రాంతి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొని వార్డు కార్యాలయం నుంచి స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంయుక్త నాగోజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్కూల్ విద్యార్థులకు తప్పిన ప్రమాదం



లింగాపూర్ వద్ద ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

మేడ్చల్: ఇంటి నుంచి విద్యార్థులకు తీసుకొస్తున్న స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు దిగి మురికి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో చిన్నారులకు ప్రమాదం తప్పింది. మేడ్చల్ పట్టణంలోని చాణక్య విజన్ స్కూల్ బస్సు వివిధ గ్రామాలకు వెళ్లి స్కూల్‌కు పిల్లలను తీసుకొస్తుండగా.. ఎల్లంపేట్ మున్సిపాలిటీకి చెందిన లింగాపూర్ వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు కిందకు వెళ్లి, పక్కనే ఉన్న మురికి కాలువలోకి దూసుకెళ్లగా.. బస్సులో ఉన్న 12 మంది పిల్లలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్ రవి యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో యాజమాన్యం ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారులను మేడ్చల్‌లోని ఆసుపత్రిలో చికిత్స చేయించారు. గత డిసెంబర్‌లో ఇదే స్కూల్ బస్సు నూతన్‌కల్ రోడ్డులో ప్రమాదానికి గురికావడం గమనార్హం.